ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి



వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకోవాలి. విధులు నిర్వహించే మహిళ వైద్యులకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి. 24 గంటల పాటు సీసీ కెమెరాల నిఘా ఉండాలి. రోగి సహాయకులపై నియంత్రణ ఉండాలి. ఒకరికే అనుమతి ఇవ్వాలి. వారికి ఎంట్రీ పాస్ ఇవ్వాలి. పరామర్శకు వచ్చే వారికి పరిమితి వేళల్లో మాత్రమే అనుమతి ఇవ్వాలి.

– డాక్టర్ వెలిగొండా రెడ్డి, పీహెచ్‌సీ, 75త్యాళ్ళూరు



సంరక్షణ సెల్ ఏర్పాటు చేయాలి

మహిళల సంరక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ వైద్యశాలలు, లేడీస్ హాస్టల్‌లో ప్రత్యేక భద్రత కల్పించాలి. వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారి రక్షణకు చర్యలు చేపట్టాలి. మహిళలపై అత్యాచారాలు, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. మహిళల ఫిర్యాదులు పరిష్కరించేందుకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

–డాక్టర్ ఆదిత్య, పీహెచ్‌సీ, 75త్యాళ్ళూరు



గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



నందిగామలోని గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామీణ స్వరాజ్యానికి పెద్దపీట వేశారని, జీవం కోల్పోయిన పంచాయతీ వ్యవస్థకు ఊపిరిలూది బతికిస్తున్నారని మాజీ మంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ నూతన హంగులు సంతరించుకునేలా పాలన అందిస్తున్నామన్నారు. 2014–19 కాలంలో చంద్రబాబు గ్రామీణ ప్రాంతాల్లో 25 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లను నిర్మించారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల్లోనే గ్రామీణాభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.990 కోట్లు, జలజీవన్ మిషన్ పథకం నిధులు రూ.500 కోట్లు మొత్తం రూ.1,490 కోట్లను గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ చేశారన్నారు. రానున్న కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో 17,500 కిలోమీటర్ల సీసీ రోడ్లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. గ్రామాల్లో మురుగునీటి సమస్య పరిష్కారం కోసం 10 వేల కిలోమీటర్ల డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారన్నారు. త్వరలో అప్రోచ్ రోడ్డుల నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీడీ పి.వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యులు సయ్యద్ సీమా, రెంటపాళ్ళ ప్రియదర్శిని, జనసేన నాయకులు బొర్రా అప్పారావు, టీడీపీ నాయకులు ఆళ్ళ సాంబయ్య, నాగమల్లేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే గ్రామ సభలు

క్రోసూరు: గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి చేసేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బి.మహేష్‌బాబు తెలిపారు. శుక్రవారం క్రోసూరు పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ మల్లా చందమామ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన సమస్యలైన విద్యుత్, తాగునీరు, మురుగు పారుదల, వైద్యం తదితర అంశాలను పరిష్కరిస్తామని, అదే విధంగా ప్రధానంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డుదారులందరికీ పనులు చూపించటం, అందుకు కావాల్సిన ప్రణాళిక సిద్ధం చేసుకోవటం జరుగుతుందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ఉద్యాన పంటలు ప్రోత్సహించటంపై తీర్మానం చేసుకుని ముందుకు వెళ్తామని అన్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, షేక్ ఖాజావలి, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులతో గ్రామీణాభివృద్ధి

అమరావతి: మండల పరిధిలోని గ్రామాలలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి చేయటానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మునగోడు గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈ సభకు సర్పంచ్ బంకా విష్ణు అధ్యక్షత వహించారు. ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించుకోవచ్చన్నారు. గ్రామాలలో డ్రైన్‌లు, రోడ్లు వంటి అవసరాలు తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుందన్నరు. నిధుల వినియోగంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రజా ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో 736 పనులను గుర్తించి సుమారు రూ.5 కోట్లతో పూర్తి చేయాలని గ్రామ సభలలో నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఎన్ఆర్‌జీఈఎస్ సిబ్బంది, కూలీలు, మేట్‌లు అధికారులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు.



క్రోసూరు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో మహేష్‌బాబు



మునగోడు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు



గోళ్ళపాడు గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానిశంకర్

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: గ్రామాల్లో అభివృద్ధి పనుల ఎంపికపై అన్ని గ్రామాల్లోను గ్రామ సభలు శుక్రవారం జరిగాయి. బొల్లవరం గ్రామంలో జరిగిన గ్రామ సభలో మండల ప్రత్యేకాధికారి జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజర్ వరలక్ష్మీ పాల్గొన్నారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదులు గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లోని సభల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని సభల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా నూతన పనులను గుర్తించేందుకు గ్రామ సభలను నిర్వహించారు. అన్ని గ్రామాలలో సభలకు ప్రత్యేక అధికారులు హాజరయ్యారు. బెల్లంకొండ గ్రామ సభలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ఉపాధి హామీ పథకం ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. ఎక్కువ పనిదినాలు, పనులు చేస్తే పంచాయతీలకు ఎక్కువ నిధులు వస్తాయని తెలిపారు. వివిధ గ్రామాలలోని గ్రామ సభల్లో ఏపీవో కోటమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మండలంలో రూ.2.27 కోట్ల పనులకు తీర్మానాలు

రాజుపాలెం: గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించడం వలన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఉమ్మడి గుంటూరు జిల్లా సీఈవో వసంతరాయుడు తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులు గుర్తించడంపై గ్రామ సభలు శుక్రవారం జరిగాయి. రాజుపాలెం గ్రామ సభలో గుంటూరు జిల్లా సీఈవో వసంతరాయుడు మాట్లాడుతూ అందరు కలసికట్టుగా గుర్తించిన పనులు చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. అంచులవారిపాలెం గ్రామ సభలో జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, మండల ప్రత్యేక అధికారి కె.ఉమాదేవి పాల్గొని మాట్లాడుతూ 17 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించగా మొత్తం 43 పనులకు గాను రూ.2.27 కోట్లతో పనులు చేసేందుకు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణప్రసాద్, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ పులిబండ్ల అశోక్, గణపవరంలో ఏవో వెంకటనర్సయ్య, రాజుపాలెంలో తహసీల్దారు ఎన్.దుర్గేష్‌రావు, చౌటపాపాయపాలెంలో ఎంఈవో మల్లికార్జునశర్మ తదితరులు పాల్గొన్నారు.



రాజుపాలెం గ్రామ సభలో గుంటూరు జిల్లా సీఈవో, సర్పంచ్, అధికారులు

వలసలు నివారించేందుకే ఉపాధి పనులు

అచ్చంపేట: గ్రామాలలో వలసలు నివారించి, ఉన్న గ్రామంలోనే పనులు చూపించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకు వచ్చిందని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు. ఉపాధి పనులపై స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. సభకు సర్పంచ్ షేక్ జానీ అధ్యక్షత వహించారు. గ్రామంలో అవసరమైన పనులను గ్రామస్తులే ఎంపిక చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని, ఆ పనులను సర్పంచ్, ఉపాధి సిబ్బంది దృష్టికి తీసుకెళతారన్నారు. వారు చర్చించి తిరిగి గ్రామ సభను నిర్వహించి అందరి ఆమోదం మేరకు పనులను ఎంపిక చేసి ప్రారంభిస్తారని చెప్పారు. పనులులేక ఏ ఒక్కరు వలస వెళ్లవలసిన అవసరం లేదన్నారు. వేసవిలోను పంట కాలువల పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేసుకోవచ్చని తెలియజేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామాత్యులు పవన్‌కళ్యాణ్ సూచన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు అన్ని గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, కార్యదర్శి సుబ్బారావు, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, ఎంపీటీసీ నాగరాజు, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసయాదవ్

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

పెదకూరపాడు: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పెదకూరపాడులో పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గుడిపూడి రాజు అధ్యక్షతన ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు పనులకు వెళ్లాలన్నారు. ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు చేయిస్తామన్నారు. పెదకూరపాడులో ప్యాసింజర్ రైలు హాల్ట్‌కు కృషి చేస్తామన్నారు.

- కూటమి ప్రభుత్వంలో పంచాయతీలు బలోపేతం అవుతున్నాయని గాంధీజీ కలలు నేరవేరుతాయన్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలో ఆర్థికంగా బలోపేతం అయిన వారు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
- పుట్టిన గడ్డ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ప్రభుత్వ అందించే ప్రోత్సాహంతో డొంక రోడ్లు, సీసీ రోడ్లు బాగు చేసుకోవాలని సూచించారు.
- ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నెలకుదుటి వరప్రసాద్, ఆర్తిమళ్ల రమేష్, గల్లా బాబు రావు, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, భాష్యం ఆజినేయులు, బెల్లంకొండ రామగోపాలరావు, షేక్ ముంతాజ్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఏపీవో కోటేశ్వరరావు, ప్రత్యేకాధికారి ధనలక్ష్మీ పాల్గొన్నారు.



పెదకూరపాడు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీ లావు

శ్రావణ మాసం ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: శ్రావణ మాసం మూడవ శుక్రవారం పురస్కరించుకొని పట్టణం, మండలంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, వడ్డవల్లి పోలేరమ్మతల్లి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల్లోను స్వామి వార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



సత్తెనపల్లిలోని వాసవి అమ్మవారు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని అన్ని గ్రామాల ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముప్పాళ్ళలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, చాగంటివారిపాలెంలోని బలభద్ర సహిత జగన్నాథస్వామి ఆలయం, మాదలలోని సంగమేశ్వర స్వామి స్వామి ఆలయం, నార్నెపాడులోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వార్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు దేవాలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని భవాని నగర్‌లో వెంచేసియున్న కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.





వైరల్ ఫీవర్లు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలి

పిడుగురాళ్లరూరల్: పిల్లలు, వృద్ధులు బలహీనమైన వారిలో వైరల్ ఫీవర్ త్వరగా వ్యాపిస్తుందని జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ అన్నారు. మండలంలోని వీరాపురం, తుమ్మలచెరువు గ్రామాల్లో ర్యాపిడ్ రెస్పాన్సిబుల్ టీమ్ ఆధ్వర్యంలో గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్లు మంట, అధిక వేడి, తలనొప్పి, కండరాల నొప్పులు, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉన్న వెంటనే డాక్టర్లను సంప్రదించాలని తెలిపారు. నీటిని నిల్వ ఉంచకూడదని, నీరు పారే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇంట్లో కొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు, పనికిరాని టైర్లు ఉంచకూడదని, వాటిల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది, వైరల్ ఫీవర్లు వస్తాయని, వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కల్లాం, డాక్టర్లు ప్రవీణ్‌రెడ్డి, నాగిరెడ్డి, సూపర్‌వైజర్ ప్రభాకర్, సురేశ్, జయపాల్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వీరాపురం గ్రామంలో పర్యటిస్తున్న మలేరియా టీమ్

విధులకు న్యాయవాదులు గైర్హాజర్

గురజాల : జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా శుక్రవారం న్యాయవాదులు విధులకు గైర్హాజరయ్యారు. న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహిళలపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యక్షుడు వీరభద్రుడు, న్యాయవాదులు రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, హనుమంతరావు, చెన్నకేశవరావు, చలమరాజు, నాగార్జున ఉన్నారు.

వలంటీర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రెంటచింతల: వలంటీర్ల ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన వలంటీర్లు శుక్రవారం ఎంపీడీవో యల్లా మహాలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి వలంటీర్లకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు పరచి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.10 వేలు చెల్లించి ఆదుకోవాలని, వెంటనే విధులలోకి తీసుకోవాలని, జాబ్ చార్టు ప్రకటించాలని కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండాటి రాజు, ఎస్‌కే బాజి, వెన్నా అవినాష్‌రెడ్డి, బోనం మర్రెడ్డి తదితరులున్నారు.



క్లుప్తంగా

అక్రమ మద్యం సీజ్

క్రోసూరు: క్రోసూరు ఎస్‌ఈబీ అధికారులు గురువారం సాయంత్రం అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామంలో దాడులు నిర్వహించి అక్రమంగా యానాం మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 11 (90 ఎంఎల్) బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి

మండల ప్రత్యేకాధికారి ధనలక్ష్మి



పెదకూరపాడు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తుందని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె పెదకూరపాడులోని అంగన్‌వాడీ–2 సెంటర్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు అందిస్తున్న పోషక ఆహార వివరాలు తెలుసుకున్నారు. తల్లిదండ్రులు మూడేళ్లు పై బడిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపితే వారికి ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తామన్నారు. చిన్నారుల ఎత్తులు, బరువులు తీశారు. ఇస్తున్న పౌష్టికాహారం చిన్నారులు, తల్లులు మాత్రమే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షేక్ మున్ని, అంగన్‌వాడీ కార్యకర్త గోగుల పాటి కుమారిలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయడం అలవర్చుకోవాలి

–రిటైర్డ్ డీడీఏజీ శ్యాం సుందర్‌రెడ్డి



పెదకూరపాడు: సుస్థిర ప్రకృతి వ్యవసాయం చేయడం రైతులు అలవర్చుకోవాలని రిటైర్డ్ డీడీఏజీ శ్యాం సుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో శుక్రవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి పశువులు అనుబంధంగా ఉన్నప్పుడే పాడి పంటలు సమృద్ధిని సాధిస్తాయన్నారు. పంట మార్పిడి, విత్తన శుద్ధి, వానపాముల ఎరువులు, ఘన, ద్రవ జీవామృతంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. రైతులు శాస్త్ర పరిజ్ఞానంతో పంటలు పండించాలన్నారు. సుగంధ ద్రవ్య పంటలను జీవ నైపుణ్య పద్ధతిలో పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏవో సాయిబాబు, ఆర్ఎఫ్ఏ నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



పెదకూరపాడు: ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు టంగుటూరి ప్రకాశం పంతులుగారి జయంతి వేడుకలు మండలంలోని పెదకూరపాడు జెడ్పీ పాఠశాల, 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు రమణ, శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ ప్రత్యేకాంధ్ర సాధనలో కీలక పాత్ర పోషించారన్నారు. ప్రకాశం హయాంలో తిరుపతిలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, విజయవాడ కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, పున్నారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి ఆటోలు నడిపితే కఠిన చర్యలు

సీఐ ప్రభాకర్‌రావు



వెల్దుర్తి: మద్యం తాగి ఆటోలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల పట్టణ సీఐ ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం మాచర్ల పట్టణంలోని టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి ఆటో నడిపి ప్రమాదాలకు కారకులు కావద్దన్నారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి సమయంలో ఆటోలు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎస్ఐ అరుణ, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

మానవ సేవే మాధవ సేవ



పెదకూరపాడు: మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో పేద ప్రజలకు సహాయం చేసేందుకు ఎంఎల్‌టీ ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ ఫౌండేషన్ చైర్మన్ మల్లవరపు ఆరోగ్యరాజు అన్నారు. మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో శుక్రవారం సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేద వాడికి విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో ఫౌండేషన్ స్థాపించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక మంది విద్య, వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ చిన్నయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాళ్లపల్లి జ్ఞాన సుందరి పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి దుర్గా పీఠం బ్రహ్మోత్సవాలు



సత్తెనపల్లి: పట్టణంలో వేంచేసియున్న త్రిశక్తి దుర్గా పీఠం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, కలశ స్థాపన, మహాసరస్వతి సమేత దుర్గామాతకు దశ విధ అభిషేకాలు, 108 కలశాలతో అభిషేకాలు, పసుపు–కుంకుమ సమర్పణ, సామూహిక కర్పూర హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలలో అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలు, ఉపగ్రహ నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలు, సాంకేతికత ప్రయోజనాలపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పున్నారావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు సుబ్బారావులు పాల్గొన్నారు.